భం గురువాణి



22 అక్టోబర్, 2026

సంచిక-270

నిజమైన మతం ఏది

మతం అంటే ఏమి? గుళ్ళు గోపురాలకు పోవడం మతమా? చర్చిలకు పోయి ప్రార్థన చేయడం మతమా? మసీదులలో నమాజ్ చేయడం మతమా? కాదు కాదు, దీనిని మతం అని నేను ఒప్పుకోను. మతం అంటే ఏమిటి అంటే నా యొక్క నిర్వచనం వేరే వుంది. పేదలు, ఆనాథలు, నిర్గతికులు వీళ్ళను సంరక్షించేది, వీళ్ళను ఆదుకునేది నిజమైన మతం. మతం యొక్క లక్షణాలు తెలుసునా? మతానికి కొన్ని ముఖ్య లక్షణాలు వున్నాయి. సత్యం, ధర్మం, శాంతి, అహింస, త్యాగం ఇవి మతం యొక్క ముఖ్య లక్షణాలు. వీటిని ఆధారంగా చేసుకొని నిర్గతికులను, అనాథలను సమాజంలో ఆదుకోవాల్సి వుంది. ఇదే నిజమైనటువంటి మతం.

వెనుకటి కాలం నుంచి నాలుగు కులాలను ఏర్పాటు చేసినారు పెద్దలు. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు మరియు శూద్రులు అని నాలుగు కులాలను ఏర్పరచినారు. ఈ కాలంలో పుట్టుకతో కులాన్ని లెక్కవేస్తున్నారు.

ఏ కులంలో పుడితే ఆ కులపోడు అని నిర్ణయిస్తున్నారు. వెనుకటి కాలంలో అట్లా లేదండి. వృత్తి చేత కులం ఏర్పాటు చేసినారు. వ్యాపారం చేసుకునే వారు వైశ్యులు అని, దేశ రక్షణకు, సమాజ రక్షణకు పాటుపడితే క్షత్రియుడని, జ్ఞానాన్ని దానం చేసేవారిని బ్రాహ్మణులు అని అన్నారు. భగవద్గీత లోనే దీనికి ఆధారం వుంది. అయితే పండితులు దీనికి పెద్ద అడ్డు గీత వేసినారు. దీనిని చదవరు అలాగే దానికి అర్థం చెప్పరు. అయితే భగవద్గీత లో కర్మను బట్టి అంటే చేయదగ్గ పనిని ఆధారంగా చేసుకొని కులాలను ఏర్పాటు చేసినారు. దీనిని గీతాచార్యుడే గంటాపథంగా చెప్పినాడు. పండితులు దానికి పెద్ద అడ్డు గీత వేసినారు.

ఇక రాను రాను ఏం చేసినారు అంటే నాలుగు కులాలే కాదు, ఐదవ కులంను ఏర్పాటు చేసినారు. దానినే పంచమ కులం అని పేరు పెట్టినారు. పంచముడు అంటే ఛండాలుడు అని పిలుస్తారు. ఎవరు నిజమైన ఛండాలుడు చెప్పమంటారా మరి, సమాజంలో ఎంతో మంది ఛండాలురున్నారు. బ్రాహ్మణ కులంలో పుట్టి దొంగతనంగా మాంసం తింటూ, మద్యం తాగుతూ తందనాలు ఆడే వాడు నిజమైన ఛండాలుడు. క్షత్రియ కులంలో పుట్టి సమాజంలో ప్రజల యొక్క ఆస్తిపాస్తులను రక్షణ చేయకుండా, స్త్రీల మాన మర్యాదలను

కాపాడకుండా వాళ్ళ ఆస్తులను దోచుకుంటూ వాళ్ళ మానమర్యాదలను మంట కలిపేవాడు నిజమైన ఛండాలుడు. వైశ్య కులం లో పుట్టి దానం ధర్మం పరోపకారం అనే గుణాలు లేకుండా ఏ రీతిగా ఐతే జలగ లాగ మనిషి యొక్క రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తుందో అదే రీతిగా జనుల వద్ద వడ్డీలు చక్ర వడ్డీలు వేసి ధనాన్ని లాగుతారో వాళ్ళని నిజమైనటువంటి ఛండాలురు అంటారు.

మహమ్మదీయ మతంలో పుట్టి మహమ్మద్ ప్రవక్త యొక్క తత్వసారాన్ని సరిగా అర్థం చేసుకోకుండా మా కులమే పెద్దది, మేమే పెద్ద వాళ్ళము అన్నటువంటి భేద భావంతో కులమత భేదాలను సృష్టించి సమాజంలో తిరిగే వాడే నిజమైన చండాలుడు. క్రైస్తవ మతంలో పుట్టి ఏసు క్రీస్తు యొక్క తత్వాన్ని అర్థం చేసుకోకుండా పొరుగు వారిని ప్రేమించకుండా, మా కులం పెద్దది, మేమే పెద్దవాళ్ళం అని సమాజంలో తిరిగే రాక్షసులు వున్నారు, వాళ్ళు నిజమైన ఛండాలురు.

ఇటువంటి ఛండాలురు సమాజంలో చాలామంది వున్నారు. అందుకే మనిషి గుణంలో ఉత్తముడు కావాలి కానీ కులం లో కాదు అని అంటారు మహానుభావులు. కనుక శిష్య భక్తాదులారా ఈ కులం, మతం అనే భావనను ప్రక్కన పెట్టి అందరు కలసి మెలసి జీవించగలరని ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.